క్లుప్తంగా

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



వ్రత పూజల్లో పాల్గొన్న మహిళలు

మల్కాపురం: పౌర్ణమి సందర్భంగా ఆదివారం స్థానిక ఐటీసీ చింతామణి దుర్గాగణపతి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని వేంకటేశ్వర స్వామి సన్నిధానం వద్ద సత్యనారాయణ స్వామి విగ్రహాన్ని నెలకొల్పి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకాలు చేశారు. స్వామిని నూతన వస్త్రాలు, సుగంధ మాలలతో అలంకరించి వ్రత పూజలు జరిపారు. పారిశ్రామిక ప్రాంతం నలుమూలల నుంచి మహిళలు, దంపతులతో పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం యాదవ వీధిలోని శ్రీకృష్ణ మందిరంలో సోమవారం అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అయ్యప్పస్వామి పుట్టినరోజు సందర్భంగా అయ్యప్ప పీఠం భక్తులు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామికి సామూహిక అభిషేకాలు, అర్చనలు, పీఠం పూజలు చేస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదానం నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

పోలీస్ అవుట్‌పోస్ట్ ఏర్పాటు



గోపాలపట్నం బంక్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్‌పోస్ట్

గోపాలపట్నం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో గోపాలపట్నం బంక్ జంక్షన్‌లో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశారు. నిత్యం వాహనాల తనిఖీలు, అక్రమ రవాణాలపై నిఘా పెట్టేందుకు నగర పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు నగరు శివారులో పార్లమెంట్ నియోజకవర్గం బోర్డర్లలో అవుట్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. బంక్ జంక్షన్ ప్రధాన కూడలి కారణంగా ఇక్కడ కూడా ప్రత్యేక అవుట్ పోస్ట్‌ను సిద్ధం చేశారు. ఇది పశ్చిమ నియోజకవర్గ బోర్డర్‌కు దగ్గరగా ఉండటం.. పలు ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే కూడలి కావడంతో ఇంత ప్రాధాన్యమిచ్చారని చెబుతున్నారు. అవుట్‌పోస్ట్‌లో సిబ్బంది ఇంకా నియమించలేదు.

పరిపూర్ణ ఆనందంతో జీవించాలి



మాట్లాడుతున్న బెహన్ మోహిని ఆహూజా

సీతమ్మధార: ప్రతి ఒక్కరూ పరిపూర్ణ ఆనందంతో జీవించాలని బెహన్ మోహిని ఆహూజా అన్నారు. మన కళ్లతో ప్రపంచంలో ఉన్న అన్నింటినీ చూడగలమని, నిరాకార పరమాత్మను మాత్రం దర్శించలేమని, సద్గురువు ప్రసాదించే జ్ఞాననేత్రం ద్వారానే నిరాకార ఈశ్వరుడిని చూడగలమని పేర్కొన్నారు.

గురుద్వారా దరి కావేరి కల్యాణ మండపంలో సద్గురుమాతా సుదీక్ష జీ మహరాజ్ ఆశీర్వాదంతో భక్తులందరికీ ఆశీస్సులు ఇచ్చి మంచి మాటలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనువు, మనసు, ధనంతో పరిపూర్ణ ఆనందం పొందాలన్నారు. భక్తులందరినీ కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాకేష్‌పాల్, రాజీవేర్, ప్రేమ్ మీర్ పూరీ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి బ్యూటిఫుల్



నేడు

టైల్స్‌తో అందంగా కనిపిస్తున్న ఫుట్‌పాత్

- కంచరపాలెం నేతాజీ వంతెనకు మహర్దశ
- శిథిలావస్థ నుంచి సుందరీకరణ
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫ్లైఓవర్ అభివృద్ధి

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో కంచరపాలెం నేతాజీ వంతెనకు మహర్దశ పట్టింది. ఈ ఫ్లైఓవర్ బ్రిడ్జిని అభివృద్ధి చేయడంతో పాదచారులు, వాహన చోదకులు సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు. కంచరపాలెం మెట్టు కూడలి నుంచి జ్ఞానాపురం రైల్వే స్టేషన్ వరకు గల రహదారుల అభివృద్ధికి జీవీఎంసీ రూ.1.65 కోట్ల నిధులు మంజూరు చేసింది. నేతాజీ వంతెనకు మరమ్మతులు చేపట్టడమే కాకుండా ఈ మార్గంలో బీటీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, పూలకుండీలు ఏర్పాటు చేసి, బ్రిడ్జి గోడలకు ఆకర్షణీయ రంగులు వేసి చక్కగా తీర్చిదిద్దారు. పాదచారులు నడిచేందుకు వీలుగా ఫుట్‌పాత్‌లపై టైల్స్, జీబ్రా క్రాసింగ్ రంగులు వేశారు. ఆహ్లాదకర వాతావరణం కంటికి కనిపించేలా వంతెనను బ్యూటిఫుల్‌గా ఆధునికీకరించారు.



నేడు

సుందరంగా కంచరపాలెం నేతాజీ వంతెన

నాడు కళావిహీనం..

గత ప్రభుత్వంలో నేతాజీ వంతెన కళావిహీనంగా ఉండేది. దీని పరిస్థితిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కంచరపాలెం ప్రధాన కూడలి నుంచి జ్ఞానాపురం రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గాల్లో విద్యుత్ లైట్లు వెలగక చిమ్మచీకట్లు కమ్ముకునేవి. వంతెనపై విద్యుత్ స్తంభాలు తుప్పుపట్టి నేలకొరిగాయి. ఫుట్‌పాత్‌లపై పాదచారుల రాకపోకలకు ఇబ్బందికరంగా పడి ఉండేవి. రాత్రి వేళ చీకట్లలో వాహన చోదకులు ఇబ్బందులు పడేవారు. సాయంత్రం అయ్యేసరికి వంతెన మార్గం అంధకారంతో నిండి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారేది. ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళా వాకర్స్ ఇబ్బందులు పడేవారు.



నాడు

కళ తప్పిన నేతాజీ వంతెన

నేడు సుందరీకరణ : వైఎస్సార్‌సీపీ ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులు కె.కె. రాజు, ఆడారి ఆనంద్‌కుమార్, దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌ల కృషితో నేతాజీ వంతెన అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. జీవీఎంసీ జోన్-5 ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో బ్రిడ్జిపై ఫుట్‌పాత్‌లు నిర్మించి సిమెంట్ పలకలు, టైల్స్ వేశారు. తుప్పుపట్టిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు. వాటికి లైట్లు అమర్చడంతో వంతెనపై వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఫ్లైఓవర్‌పై కొత్త హంగులు, ప్లాంటేషన్ పనులు పూర్తి చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. కంచరపాలెం నేతాజీ వంతెనను అభివృద్ధి చేయడంతో స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేతాజీ వంతెన సుందరీకరణకు చేపట్టిన పనులు.. వినియోగించిన నిధుల వివరాలు

పనులు	నిధులు
సీసీ రోడ్లు	రూ.11.50 లక్షలు
బీటీ రోడ్లు	రూ.45.82 లక్షలు
వంతెన జాయింట్‌కు గ్రౌటింగ్	రూ.12.32 లక్షలు
ఫుట్‌పాత్‌పై సిమెంట్ పలకలు	రూ.08.21 లక్షలు
ఫుట్‌పాత్‌లకు టైల్స్	రూ.23.45 లక్షలు
విద్యుత్ స్తంభాలు, లైట్లు	రూ.12.67 లక్షలు
ఫుట్‌పాత్‌లకు రంగులు	రూ.18.50 లక్షలు
వంతెన రక్షణ గోడలకు రంగులు	రూ.22.98 లక్షలు
వంతెనపై ప్లాంటేషన్	రూ.10.20 లక్షలు



నాడు

వంతెనపై విరిగిన ఫుట్‌పాత్



కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్‌పై ప్లాంటేషన్

పచ్చదనంతో వంతెన



గతంలో కంచరపాలెం నేతాజీ వంతెనపై నడవాలంటేనే ఇబ్బందికరంగా, రాత్రి వేళ భయంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధితో వంతెన సమస్యలకు మోక్షం లభించింది. వంతెనను పచ్చదనంతో నింపారు. వాహన చోదకులు, పాదచారులు సౌకర్యవంతంగా ప్రయాణిస్తున్నారు.

– గిడుతూరి రాణి, జ్ఞానాపురం

సాఫీగా రాకపోకలు



కొత్త రోడ్లు, ఫుట్‌పాత్‌లు, విద్యుత్ లైట్లు, రంగులతో నేతాజీ ఫ్లైఓవర్ కళకళలాడుతోంది. వాహన చోదకులు సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెనను అభివృద్ధి చేశారు.

– పాత్రపిల్లి సునీల్‌కుమార్, కంచరపాలెం

జోరుగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం



40వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు



62వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింథియా: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసిన అభివృద్ధి, సంక్షేమంతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం సాయంత్రం వార్డు పరిధిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పేద, బడుగు, బలహీనవర్గాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. పేదల కోసం అనేక పథకాలు అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాటలోనే నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ తనదైన శైలిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆనంద్‌కుమార్‌ను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డులో..

సింథియా : దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిన వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ను గెలిపించుకోవాలని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ప్రజలను కోరారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం వార్డులోని త్రినాథపురంలో గల 142, 143, 144, దుర్గానగర్‌లోని 147, ప్రకాష్‌నగర్‌లోని 121 పోలింగ్ బూత్‌ల పరిధిలో నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు అత్యధిక మేలు చేకూరిందని, ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు మెరుగుపడ్డాయన్నారు. గత పాలకుల తీరుతో అభివృద్ధికి నోచుకోని ప్రభుత్వ పాఠశాలలు కొత్త రూపు సంతరించుకున్నాయన్నారు. అదే అభివృద్ధి కొనసాగాలంటే మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆనంద్‌కుమార్‌ను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బీశెట్టి గణేష్, స్థానిక నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ఆయా పోలింగ్ బూత్‌ల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రానికి గుణపాఠం చెబుదాం

కూర్మన్నపాలెం: ఉద్యమాలతో కేంద్రప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 1,137వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వారికి అప్పగించాలన్న నిర్ణయానికి ఎదురు తిరిగిన కార్మిక వర్గానికి దెబ్బ కొట్టాలని చూస్తున్నారన్నారు. ఇందుకు అనుగుణంగా దొడ్డిదారిన స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీరం చేయడానికి ఉక్కు యాజమాన్యంతో కలిసి విద్రోహ చర్యలు చేపట్టారని, సంస్థలో ప్రధాన విభాగాలను పాక్షికంగా నిలిపివేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఉక్కు నిర్వాసితులు ఇప్పటికీ శాశ్వత ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు ఉద్యమ సెగ దేశవ్యాప్తంగా వెళ్లిందన్నారు. దీనికి మద్దతుగా కార్మికులంతా పెద్ద ఎత్తున ఉక్కు ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



లక్ష్మీనగర్-ఎఫ్ బ్లాక్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న పాస్టర్ జాకబ్ రాజ్

గోపాలపట్నం: ఏసుక్రీస్తును స్తుతిస్తూ మట్టల ఆదివారం వేడుకను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని ప్రార్థనా మందిరాల వద్ద నుంచి ర్యాలీలు చేశారు. ఈత మట్టలకు పూలు గుచ్చి క్రీస్తు పాటలు పాడుతూ, బైబిల్ వాక్యాలను ప్లకార్డులపై ప్రదర్శిస్తూ దావీదు కుమారుడా.. నీకు జయమంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. జయప్రకాష్ నగర్ ఎరుసలేమ్ చర్చ్ పాస్టర్ సిస్టర్ పీస్ ఏంజెల్ బ్లెస్సీ ఆధ్వర్యంలో, సేవియర్ లూథరన్ చర్చ్ పాస్టర్ రెవరండ్ లంకపల్లి జాకబ్ రాజ్ ఆధ్వర్యంలో సండే స్కూల్ పిల్లలు, యూత్ సభ్యులు, పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గోపాలపట్నం, కొత్తపాలెం, వెంకటాపురం ప్రాంతాల్లో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు.



జయప్రకాష్‌నగర్‌లో చిన్నారులు ర్యాలీ



63వ వార్డు ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

63వ వార్డులో..

సింథియా: జీవీఎంసీ 63వ వార్డులోని పలు ప్రాంతాల్లో క్రీస్తు ఆరాధికులు మట్టల ఆదివారం ర్యాలీ నిర్వహించారు. బైబిల్ గ్రంథాన్ని అనుసరిస్తూ నాడు ఏసుక్రీస్తును గాడిదపై తెల్లని వస్త్రాలతో ఊరేగించిన దానికి స్ఫూర్తిగా ఈ ర్యాలీ నిర్వహించామని క్రైస్ట్ చర్చి ఫాదర్ శైలాస్ తెలిపారు. మట్టలు చేతపట్టుకుని హోసన్నా, హోసన్నా అంటూ క్రీస్తు రాకను తెలియపరుస్తూ సంఘ సభ్యులు, చిన్నారులు నినాదాలు చేశారు.

అవగాహనతోనే నేరాల నియంత్రణ



విమాన్‌నగర్ వాసులకు అవగాహన కల్పిస్తున్న సీఐ చక్రధరరావు

గోపాలపట్నం: ప్రజల్లో అవగాహన కలిగితే నేరాలను నియంత్రించవచ్చని ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ సీఐ వి.చక్రధరరావు అన్నారు. ఆదివారం సాయంత్రం విమాన్‌నగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైన్ స్నాచింగ్‌లపై మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒంటరిగా వెళ్లరాదని, అలా వెళ్లాల్సి వచ్చినపుడు విలువైన వస్తువులు ధరించవద్దని సూచించారు. అపార్ట్‌మెంట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఇంటికి తాళాలు వేసి వెళ్లినపుడు పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో నిఘా ఎక్కువగా పెడతామన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను పెట్టుకుంటే రక్షణగా ఉంటుందని తెలిపారు. ఈ యాప్ ఉపయోగాలను వివరించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఉల్లంఘనలకు పాల్పడవద్దని కోరారు. అభ్యర్థుల ప్రలోభాలకు లొంగవద్దని సూచించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటోందన్నారు. సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి వ్యవస్థలే ముఖ్యం





మాట్లాడుతున్న ఆచార్య ప్రసన్నకుమార్, చర్చా కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు

సీతంపేట: ప్రజాస్వామ్యం విజయవంతం కావడానికి వ్యవస్థలు సక్రమంగా పని చేయాలని సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్ అన్నారు. సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్, విశాఖ పబ్లిక్ లైబ్రరీ సంయుక్తంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జయశంకర్ రచించిన గ్రంథం 'వై భారత్ మేటర్స్'పై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యక్తులు మారినా సంస్థలు శాశ్వతంగా నిలిచి ఉంటాయన్నారు. న్యాయవాది ఎం.రామదాస్ మాట్లాడుతూ జయశంకర్ రచించిన పుస్తకంలోని ముఖ్య అంశాలను సమీక్షించారు. భారతదేశం ప్రపంచంలో శక్తివంతమైన దేశంగా ఎదగడానికి తగిన వనరులున్నాయని, వ్యవస్థల మధ్య సమన్వయంతో పాలన సాగాలన్నారు. లంకపల్లి బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్ మాట్లాడుతూ నెహ్రూ, ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, నరేంద్రమోదీ విధానాలను వివరించారు. మోదీ రాముడిని ఒక గొప్ప నాయకుడిగా చూపిస్తున్నారని, భారతీయ సంస్కృతి వైశిష్ట్యాన్ని లోకానికి చాటడానికి ప్రాధాన్యమిస్తున్నారని చెబుతూ, రామాయణంలోని మానవీయ కోణాన్ని వివరించారు. గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, రచయిత డి.వి.సూర్యారావు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం

ఫిట్‌నెస్, ఆరోగ్యం కోసం గతంలో పెద్దపెద్ద జిమ్‌లకు వెళ్లి వేల రూపాయలు సమర్పించుకోవాల్సి వచ్చేది. అలాగే పెద్ద వయసు వారు వాకింగ్ చేసుకోవడానికి కూడా సరైన వాకింగ్ ట్రాక్‌లు లేక ఆరుబయట రోడ్ల మీదే ఫుట్‌పాత్‌లపై నడవాల్సి వచ్చేది. కానీ ఇటీవల జీవీఎంసీ పార్కులను ఆధునికీకరించి అనేక సదుపాయాలు కల్పించింది. పెద్ద మొత్తం ఖర్చు చేసి వాకింగ్ ట్రాక్, వాయామ పరికరాలు ఏర్పాటు చేయడంతో పిల్లలు, పెద్దవారు కూడా ఇప్పుడు పార్కుల బాట పడుతు న్నారు. 60వ వార్డు గుల్లలపాలెం వాకర్స్ పార్కులోని ఓపెన్ జిమ్, 58వ వార్డు పిలకవానిపాలెంలోని ఓపెన్ జిమ్ ఇందుకు చక్కటి ఉదాహరణ.

- ఓపెన్ జిమ్‌లకు క్యూ కడుతున్న చిన్నాపెద్ద
- వాకింగ్, వ్యాయామంతో ఫుల్ ఫిట్‌నెస్

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని ప్రధాన కూడలిలో వాకర్స్, చిన్నారుల కోసం ప్రభుత్వం ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. దీంతో పలువురు వాకర్లు, చిన్నారులు అక్కడ వ్యాయామం, ఆటల వంటి వాటితో ఆరోగ్యం, ఆనందం పొందుతున్నారు. జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ఉదయం, సాయంత్రం సందర్శకులతో కళకళలాడుతుంటుంది. ఈ ప్రాంతంలోని మహిళలు, యువత, విద్యార్థులు, నడి వయసు వారు చక్కగా వాకింగ్ చేస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలతో వ్యాయామం చేస్తూ కనిపిస్తున్నారు. ఈ జిమ్ ఏర్పాటు వల్ల ఆరోగ్యంతో పాటు ఆనందం సొంతమవుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గుల్లలపాలెం వాకర్స్ పార్కులో వ్యాయామం చేస్తున్న చిన్నారులు

గుల్లలపాలెం వుడా కాలనీలోను..

60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలోని వాకర్స్ పార్కులో కూడా జీవీఎంసీ అధికారులు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ఇక్కడికి సైతం నిత్యం ఎంతో మంది వాకర్స్ వస్తుంటారు. కొంత సేపు నడక తర్వాత వారు ఇక్కడి పరికరాలతో వ్యాయామం చేస్తారు.



పిలకవానిపాలెంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

పచ్చని ప్రకృతి నడుమ..

ఇక్కడి పార్కుల్లో పచ్చటి చెట్ల నడుమ వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఉండటంతో ఆహ్లాదకర వాతావరణం వెల్లివిరుస్తుంటుంది. స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుంటుంది. దీంతో వయసు మళ్లిన వారు కూడా ఇక్కడికి నడక, చిన్నపాటి వ్యాయామాలు చేసుకోవడానికి వస్తుంటారు.

ఎంతో ఉపయోగకరం



గుల్లలపాలెం వుడా కాలనీలోని వాకర్స్ పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం వల్ల అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఇక్కడ చాలా మంది వాకింగ్, ఎక్సర్‌సైజ్ చేస్తుంటారు. నేను ఇక్కడ ఫ్రెండ్స్‌తో ఆడుకుంటూ ఉంటాను. అందరికీ ఉపయోగకరంగా ఉంది.

– చైతన్య, శ్రీహరిపురం

దూర ప్రాంతాలకు వెళ్లే బాధ తప్పింది



మా ప్రాంతంలోనే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం వల్ల దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన బాధ తప్పింది. సెలవు రోజుల్లో ఉదయం, సాయంత్రం కూడా ఓపెన్ జిమ్‌కు వెళ్తుంటాను. మా ఫ్రెండ్స్ కూడా వస్తుంటారు. అంతా సరదాగా గడుపుతాం.

– దినేష్‌రెడ్డి, పిలకవానిపాలెం

పారిశ్రామిక వాడలో హోలీ వేడుకలు





రంగులు పూసుకుంటున్న కార్మికులు, హోలీ వేడుకల్లో యువత

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో నివసిస్తున్న నార్త్ ఇండియన్స్ హోలీ వేడుకలను సందడిగా జరుపుకున్నారు. ఇక్కడి హెచ్‌పీసీఎల్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు వేడుకల్లో పాల్గొన్నారు. మల్కాపురం, శ్రీహరిపురం, ఆర్‌కేపురం తదితర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారంతా రోడ్లపైకి వచ్చి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని హోలీ శుభాకాంక్షలను తెలుపుకుని స్వీట్లు తినిపించుకున్నారు. అలాగే హెచ్‌పీసీఎల్‌లో పని చేస్తున్న కార్మికులు తాము పని చేస్తున్న చోట రంగులు చల్లుకుని ఆనందంగా గడిపారు.